హైదరాబాద్ వార్త

బల్కంపేట ఎల్లమ్మ సేవలో ఎమ్మెల్యే తలసాని

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త

దేవి నవరాత్రుల సందర్భంగా మొదటిరోజు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బాల త్రిపురసుందరి దేవి అలంకారంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంచార్జీ ఈఓ కృష్ణ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామ న శేషుకుమారి, ఆలయ చైర్మన్ కె.సాయిబాబాగౌడ్, సూపరింటెండెంట్ హె మావతి, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, సీనియర్ నాయకులు అశోక్‌యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, లక్ష్మీ, కట్ట బలరాం, వనం శ్రీనివాస్, గుడిగే శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి " ఫ్యామిలీ డిజిటల్ కార్డు " సర్వే

-ఇంటింటికి వెళ్ళి వివరాలు సేకరించనున్న ప్రత్యేక బృదాలు

-పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి నియోజకవర్గంలో నాలుగు కాలనీలు ఎంపిక

-ఒక్కో టీం రోజుకు 40ఇళ్లు సర్వే చేసేలా ప్రణాళికలు

హైదరాబాద్, అక్టోబరు 3,ప్రభాతవార్త: ప్రతికుటుంబానికి ప్రత్యేకంగా డిజిటల్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సిఎం రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్ వేదికగా ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. రేషన్ ,ఆరోగ్యం, సంక్షేమం పథకాలన్నీటికీ ఉప యోగపడేలా కార్డులను రూపొందించి ..లబ్దిదారు లకు అందించేందుకు సిద్ధమువుతన్నారు. ఒకే రాష్ట్ర ఒకే డిజిటల్ కార్డు (వన్ స్టేట్ -వన్‌డిజిటల్ కార్డు)విధానంతో ముందుకెళ్ళాలని భావిస్తున్నా రు. కుటుంబం డిజిటల్ కార్డులో మహిళలనే ఇంటి యజమానిగా గుర్తించడంతోపాటు అర్హులం దరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు సిద్ధం చేయనున్నారు. వీటితో లబ్దిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఈకార్డులో ప్రతి కుటుంబ సభ్యుడి హెల్త్‌ప్రొఫైల్ (ఆరోగ్యసమాచారం)ఉండ నుంది. ఆయా కుటుంబాల్లో కొత్తసభ్యుల చేరిక, తొలగింపుకు, సంబంధించి ఎప్పటికప్పుడు కార్డు ను అప్‌డేట్ చేసుకునేలా చర్యలు చేపట్టనున్నారు.

ప్రతి నియోజకవర్గంలో 4కాలనీలు ఎంపిక ..

ఫ్యామిలీ డిజిటల్ కార్డుకోసం ఫైలట్ ప్రాజెక్ట్‌కింద జిహెచ్ఎంసి పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో రెండు కాలనీలను ఎంపిక చేశామని అడిషనల్ కమిషనర్ స్నేహా శబరీష్ తెలిపారు. ఈమేరకు గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో పన్వర్‌హాల్‌లో టాక్స్ ఇన్స్పెక్టర్లు, తహసీల్దార్లు, ఏఎంసిలు, డిపివోలు, సివోలు తదితర కు ఫ్యా మిలీ డిజిటల్ కార్డుల కోసం సేకరించాల్సిన వివ రాలు, ఫార్మాట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చా రు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్ట్‌కింద ప్రతి నియోజకవర్గంలో నాలుగు కాలనీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన టీంలు ఆయా కాలనీలల్లో ఇంటింటికి తిరిగి కుటుంబాల వివరాలు సేకరించాలని, ఒక్కో టీం ప్రతిరోజు కనీసం 40ఇండ్లను సర్వే చేయా లని సూచించారు. సంబంధిత ఫార్మాట్‌లలో ఆప్డేట్ డీటెయిల్స్ నింపాలన్నారు. దీని పర్యవేక్ష ణకు ప్రతి నియోజకవర్గానికి ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారని సర్వే సందర్భంగా ఆయా కుటుంబా ల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు ,కొత్త ఫ్యామిలీ , మైగ్రేషన్, పర్మినెంట్‌గా విదేశాలు వెళ్ళిన వివరాలు, తీసుకుని ఎంట్రీ చేయాల్సి ఉం టుందన్నారు. ఐదు రోజుల్లోగా అంటే ఈనెల 8వ తేదీ వరకు ఇది పూర్తి కావాలని,9వ తేదీ స్క్రూటినీ, 10వ తేదీన ప్రభుత్వానికి నివేదిక పం పాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి ఒక్కకార్డు మాత్రమే ఉంటుందని హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీగా కుటుంబాంలోని సీనియ ర్ మహిళలను తీసుకోవాలని తెలిపారు. కుటుంబ సభ్యులు ఒక చోటమాత్రమే వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

వివరాల సేకరణ ఇలా..

ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం కుటుంబసభ్యుల నుంచి పలు వివరాలు సేకరించన్నారు. ఇందులో భాగంగా కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేర్లు, జెం డర్, పుట్టిన తేదీ, వయస్సు, కుటుంబపెద్దతో ఉ న్న సంబంధం, అధార్‌నంబర్, అడ్రస్ వివరాలు సేకరిస్తారు. ప్రతికుటుంబంలో కుటుంబ పెద్దగా ఆకుటుంబానికి చెందిన మహిళపేరును హెడ్‌ఆఫ్ ది ఫ్యామిలీగా పరిగణిస్తారు. ఫ్యామిలీ మొత్తానికి ఒకేరకమైన గుర్తింపు సంఖ్యను (ఫ్యామిలీ ఐడీ) ఇవ్వడంతోపాటుగా, కుటుంబంలో ఉన్న వ్యక్తికి పర్సనల్ ఐడీని జారీ చేస్తారు. వివరాలు సేకరిం చిన అనంతరం కుటుంబసభ్యుల ఫోటోలు క్యా ప్చర్ చేయడం జరుగుతుంది.

మొదటగా సర్వే చేయనున్న వార్డులు..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ -అంజయ్యనగర్, సికింద్రాబాద్ -మహ్మద్‌గూడ, బహదూర్‌పురా -రామనాస్థపుర, యాకుత్‌పురా -నెహ్రూనగర్, చాంద్రాయణగుట్ట -గులాం మురుజా కాలనీ, చార్మినార్- మోతీ గల్లి, గోషామహాల్ -హిందీనగర్, కార్వాన్ -బాగ్దాద్ కాలనీ, నాంపల్లి -ఎపిహెచ్‌బి కాలనీ, సనత్‌నగర్ -సైంటిఫిక్‌నగర్ , జూబ్లీహిల్స్ -ఎల్.ఎన్‌నగర్ (కృష్ణానగర్), ఖైరతాబాద్ -లక్ష్మీనగర్ కాలనీ, అంబర్‌పేట్ -ఖాద్రీబాగ్, మలక్‌పేట్ -వాహెద్‌నగర్, ,ముషీరా బాద్ -శ్రీనివాసపురం కాలనీ, శేరిలింగంపల్లి -పిజెఆర్ కాలనీ, రాజేంద్రనగర్ -గుమ్మకంద కాల నీ, మహేశ్వరం -టెలిఫోన్ కాలనీ, ఎల్బీనగర్ -జనప్రియా హోమ్స్, ఉప్పల్ -భవాని నగర్, కూకట్‌పల్లి -సంగీత్‌నగర్, కుత్బుల్లాపూర్ -అ యోధ్యనగర్, మల్కాజ్‌గిరి -గాయత్రి నగర్, ప టాన్‌చెర్వు -గౌతమ్‌నగర్‌లలో సర్వే జరగనుంది.

ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

-బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు

బేగంపేట,అక్టోబరు 3,ప్రభాతవార్త

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి.మొదటి రోజు శ్రీబాల త్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మ వారు భక్తుల కు దర్శనం ఇచ్చారు.ఉదయం గం 6లకు అభిషేక ము,ఉదయం గం 9లకు కలశ స్థాపన పూజ చేసారు. ఉదయం గం 9.30నిలకు హోమం నిర్వహించారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు.వివిధ రకాలైన విద్యుద్దీ పాలతో ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాలన్నీ ధగ ధగా మెరిసిపోయాయి.ఉదయం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ముందస్తుగా పటిష్ట మైన జాగ్రత్త చర్యలు చేపట్టడంతో అమ్మ వారి దర్శనా నికి వచ్చిన భక్తులు అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకున్నారు.

శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం.

బేగంపేట శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మీ ఆలయంలో.....

బేగంపేట శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి దేవాలయంలో దసరాశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి.ఆలయాన్ని వివిధ రకాలైన విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు వివిధ రకాలైన పూజలు నిర్వహించడంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బేగంపేట ప్రకాశం నగర్ లోని శ్రీభూలక్ష్మీదేవి అమ్మ వారి ఆలయంలో ఒక వైపు అమ్మ వారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమవగా మరోవైపు సద్దుల బతుకమ్మ వేడుకలలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.అల్లంతోట బాయిలోని శ్రీమహాల క్ష్మి నల్లపోచమ్మ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగ రంగ వైభవంగా ప్రారంభ మయ్యాయి.అమ్మ వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు అలయానికి తరలి వచ్చా రు.ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ఛైర్మన్ గౌరపల్లి లక్ష్మణ్,గౌరపల్లి రమేష్ ల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

పేదల ఇళ్లు కూల్చితే సహించేది లేదు

- ఎంపి ఈటల రాజేందర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్, అక్టోబర్ 3 ప్రభాతవార్తః అభివృద్ధి పనుల్లో భాగంగా మూసి పక్షాలనకు బీజేపీ వ్యతిరేకం కాదని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తెలిపారు. ప్రక్షాలన పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తామంటే సహించేది లేదన్నారు. మడ్‌ఫోర్ట్ గాయత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెరువులు బాగుచేయడానికి కూడా మేము వ్యతిరేకం కాదని తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి నోటికొచ్చినట్లు మాట్లాడడం సభ్యత కాద న్నారు. చదువుకుంటే సంస్కారం వచ్చేదని, ఇతరులు చెప్పేది విన్నా జ్ఞానం వచ్చేద న్నారు. నన్ను బతకడానికి వచ్చానని అంటున్నారని, నేను చదువుకున్నది కేశవ మెమోరియల్ స్కూల్, జూనియర్ కాలేజీ అలియా జూనియర్, డిగ్రి సైఫాబాద్ సైన్స్ కాలేజీలో పూర్తి చేశానని అన్నారు. ఏది తెలుసుకోకుండా తోచింది మాట్లాడితే ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. ఏరోజైనా ప్రజల మధ్య ఉండి సర్విస్ చేస్తే తెలిసేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 66 హామీలు, 420 పనులు చేస్తానని చెప్పి ఖాలీ చేయి చూపిస్తున్నారన్నారు. ఇప్పటి వకు ఇచ్చిన హామీలలో ఒక్క ఉచిత బస్సు తప్ప ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదన్నారు. కొడం గల్‌లో బొందపెడితే ప్రశ్నించే గొంతును గెలిపించండని మల్కాజ్‌గిరిలో అడిగితే గెలి పించారని, అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టావన్నారు. చేరువు బాధితులు ఎక్కువ గా మల్కాజ్‌గిరిలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కళ్లు పడొద్దు అంటూ ఎర్ర నీళ్లతో దిష్టి

-బతుకమ్మ ఆడుతూ మూసి ప్రాంత మహిళల నిరసన

ఎర్ర నీళ్లతో దిష్టి తీస్తున్న నివాసస్తులు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండ్లు తమ నివాసాలపై పడవద్దు అంటూ మహిళలు ఎర్ర నీళ్లతో తమ నివాసాలకు దిష్టి తీశారు. తమ నివాసాలు కూల్చవద్దని కష్టపడి కట్టుకున్న గూడును చెదరగొట్ట వద్దని వేడుకుంటూ బాధితులు కుంకుమతో కలిపిన ఎర్ర నీళ్లతో తమ నివాసాలకు దిష్టి తీశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి, కొత్తపేట డివిజన్లో పరిధిలోని మూసి పరివాహక ప్రాంతమైన వినాయక నగర్ ప్రాంతవాసులు తమ నివాసాలను రక్షించాలని వేడుకుంటూ ఈ కార్యక్రమానికి శ్రీకా రం చుట్టారు. అదేవిధంగా సీఎం దృష్టి పడొద్దని మూసీ సుందరీకరణ పేరిట తమ ఇళ్లు కూల్చొద్దంటూ సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకున్నారు. పీతృ అమావాస్య రోజు తమ ఇళ్లకు రివర్‌బెడ్ పేరిట పట్టిన పీడ వదిలిపోవాలంటూ బుధవారం రాత్రి కుంకుమ నీటితో దిష్టి తీసి ఇళ్ల ముందు ఆరబోశారు. ఇప్పటికైనా ప్రబుత్వం తమ ఇళ్ల జోలికిరావద్దని కోరారు. కాగా పలువురు మహిళలు ఎంగిలిపూల బతుకమ్మ ఆట ఆడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఇండ్ల జోలికి రావద్దని, ఎవరో చేసిన తప్పులను మాకు అంటగట్టొద్దని, దశాబ్దాలుగా కష్టపడి నిర్మించుకున్న ఇల్లు కూల్చవ ద్దని, మా బతుకులను బజారుకు ఈడ్చవద్దని బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు.

అంబేద్కర్ వర్శిటీ భూమిని జెఎన్ఎఫ్‌ఏయూకి కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన

పంజగుట్ట, అక్టోబర్ 3 (ప్రభాతవార్త):

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవి ద్యాలయానికి కేటాయించవద్దని అంబేద్కర్ వర్శిటీ పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు పరిపాలన భవనం ముందు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.భూ కేటాయింపు ఆలోచన వెంటనే ఉపసంహరించుకోవా లంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యావ్యాప్తిలో అంబే ద్కర్ ఓపెన్ యూనివర్శిటీ పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు, మహిళలకు తక్కువ ఫీజులతో ఉన్నత విద్యను అంది స్తున్న విశ్వవిద్యాలయ భూమిని వేరే విశ్వవిద్యాలయానికి కేటా యించడాన్ని ఈ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. గురువారం మద్యాహ్నం భోజన విరామ సమయంలోపూర్వ విద్యార్థులుసమాఖ్య అధ్యక్షులు సాక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినదించారు.వీరి నిరసనకు యూనివర్శిటీ జేఏసీ ఉద్యోగులు మద్దతు తెలిపారు.విశ్వవిద్యాలయ విస్తరణకు, మౌలిక వసతుల కల్పనకు ఎక్కువ మొత్తంలో భూమి అవసరం ఉందని ఇలాంటి క్రమంలో అందుబాటులో ఉన్న కొద్దిపాటి భూమిలో పది ఎకరాల భూమి వేరే యూనివర్శిటీకి కేటాయించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అంబేద్కర్ యూనివర్శిటీ భూమిని వేరేవాళ్ళకు కేటాయించడం అంటే ఉన్నత విద్యా వ్యాప్తిని, దూరవిద్య విస్తరణను అడ్డుకోవడమేనని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు నినదించారు. నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు..గంజాయి స్వాధీనం

సరూర్‌నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని మీర్‌పేట్ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపారు. పోలీసుల కథనం ప్రకారం కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ సర్వీస్ రోడ్డులో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే విశ్వసనీ య సమాచారం మేరకు అక్కడికి వెళ్ళిన పోలీసులు నందనవనం కాలనీకి చెందిన మనీష్‌సింగ్ అలియాస్ జిత్తు (48), మహ్మద్ ఖలీల్ (30)లను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వారిని తనిఖీ చేయగా 1300 గ్రాముల గంజాయి లభించింది. ఈ మేరకు వారిని విచారించగా అప్పుడప్పుడు నందనవనంకు వచ్చి గంజాయిని విక్రయించే మంగళ్‌హాట్ ప్రాంతానికి వచ్చే ఆబెద్ బిన్ ఖలీద్ అలి యాస్ లాల (37) నుండి వారు గంజాయిని కొనుగోలు చేసి అధిక మొత్తంలో అవసరమున్న వారికి విక్రయిస్తారని తేలింది. దీంతో వారిపై కేసును నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఇన్స్‌పెక్టర్ కీసర నాగ రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

తమ కుమార్తె జాడ తెలియటం లేదంటూ బండి సంజయ్‌కు తల్లిదండ్రుల వినతి

చార్మినార్,అక్టోబరు 3 ప్రభాతవార్త :

తమ కుమార్తె జాడ 150 రోజుల నుంచి తెలియటం లేదని,ఈ విష యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ పాతబస్తీ మీరాలం మండికి చెందిన భార్యాభర్తలు బుధవారం బిజెపి నాయకులు శివచంద్రన్ ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం గత కొంత కాలంగా పాతబస్తీ మీరాలం మండి ప్రాంతంలో నివాసం ఉంటున్నది. వీరి కుమార్తె (19) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువు చున్నది.తమ కుమార్తె జాడ 150 రోజులు నుంచి తెలియక తీవ్ర మనో వ్యధకు గురిపు తున్నామని వారు మంత్రికి అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నా రు.ఈ విషయాన్ని మీర్‌చౌక్ ఏసిపి వేంకటేశ్వరరావును సంప్రదిం చగా మీరాలంమండికి చెందినభార్యాభర్తలు తమ కుమార్తె కనిపించ టం లేదంటూ ఫిర్యాదు చేశారని,మహరాష్ట్రలోని ఓ యువకుడితో ఇన్‌స్ట్రాగ్రామ్‌లో మీరాలంమండికి చెందిన యువతితో పరిచయం అయ్యిందని తెలిపారు.ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయి ఉన్నాయని, అదృశ్యమైన యువతి జాడ కోసం అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దసరా ఎఫెక్ట్ ...సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఫుల్ రద్దీ

-రైల్వేలో చాంతాడంత వెయిటింగ్ లిస్ట్

-ప్రైవేట్ బస్సుల్లో ఇష్టానుసారంగా వసూళ్లు

తార్నాక, అక్టోబర్ 3 ప్రభాతవార్త:

దసరా పండుగను పురస్కరించుకొని జంట నగరాల ప్రజలు సొంతూళ్లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నేటి నుంచి దస రా శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. విద్యా సంస్థలకు పది రోజులు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో ఉద్యోగాలు, ఉపాధి, కోర్సు ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారంతా తమ సొంత ఊర్లకు వెళ్లేందుకు పయనమవుతున్నారు. రిజర్వేషన్లు దొరుకక స్వగ్రామానికి వెళ్లేందుకు కష్ట పడాల్సి వస్తుంది. రైల్లో టికెట్ రిజర్వేషన్ చూస్తే చాంతాడంత వెయిటింగ్ లిస్ట్ మరికొన్ని రైళ్ల అయితే రిగ్రేట్ కూడా కనిపిస్తుంది. పండుగను పురస్కరించుకొని దక్షిణ మధ్యరైల్వే అదనంగా 650 రైళ్లను పడుపుతోంది. జనరల్ టికెట్ తీసు కున్న వారు కూడా స్లీపర్ క్లాస్‌లో ఎక్కడంతో రైళ్ల న్నీ కిక్కిరిసిపోతున్నాయి. పండుగకు కొందరు వారి వారి వాహనాల్లో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మరి కొందరు రైల్వే...ఆర్టీసీ...ప్రైవేట్ సర్వీసుల ను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అన్ని ప్లాట్ ఫామ్‌ల్లో రద్దీగా కనిపి స్తోంది. టికెట్ కౌంటర్ల వద్ద ఫుల్ రష్ కనిపిస్తుం ది. సొంతూళ్లకు ప్రయాణం అయ్యేందుకు తెల్లవా రు జాము నుంచే ప్రజలు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటున్నారు. దసరా పండుగ కోసం ఇప్ప టికే రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను సైతం నడిపిస్తుం ది. పండుగ రద్ది నేపథ్యంలో రైల్వే స్టేషన్ల వద్ద పోలీసులు బద్రత కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ, ఏపీ ప్రయాణికుల దక్షిణ మధ్యరైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక రైళ్లను నడిపి స్తున్నప్పటికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోగీలన్ని ఇప్పటికే నిండిపోయా యి. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, లింగం పల్లి స్టేషన్ల నుంచి వెళ్లే రైళ్లలో ఎక్కువగా ప్రయా ణిస్తుంటారు. రోజుకు 200 రైళ్లలో 1,70,000 మంది ప్రయాణికులు సికింద్రాబాద్ నుంచి ప్రయా ణిస్తున్నారు. ప్రయాణికులకు అనుగుణంగా రైల్వే ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రైళ్ల పరిస్థితి ఈవిదంగా ఉంటే ఈబస్సులో ప్రయాణిం చే వారి ఇబ్బందులు వర్ణనాతీతం నాన్ స్టాప్ సర్వీసులు మినహా లోకల్ బస్సులను చూస్తే గాలి కూడా దూరలేనంత జనం కనిపిస్తున్నారు. బస్సు ల్లో ప్రయాణిస్తున్న వారికి ఊపిరి కూడా అంద దంలేదు.ఏపీఎస్ ఆర్టీసీ,టీజీ ఆర్టీసీ బస్సుల రిజ ర్వేషన్లు ఫుల్ అవ్వడంతో ప్రైవేటు ట్రావెల్స్ దొరి కిందే చాన్స్‌గా ప్రయాణికుల జేబులకు చిల్లు పడు తున్నాయి.

హైదరాబాద్ విజయవాడ వెళ్లేం దుకు ఏపీ స్లీపర్ క్లాస్ టికెట్‌ను ఏకంగా రూ. 3200లకు అమ్ముకుంటున్నారు. సాధారణంగా టికెట్ ధర రూ. సుమారుగా రూ.1000 వరకు వుంటుంది. టికె ట్లు దొరకకపోవడంతో టికెట్ ధరలు అధిక మయి నప్పటికి తిప్పిని పరిస్థితిలో వెళ్లుతున్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

-ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, చిన్నారులు

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కాలనీ మహిళలు

హైదరాబాద్, అక్టోబరు 3,ప్రభాతవార్త:

తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ వేడుకలు నగర వ్యాప్తంగా అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. నాగోల్‌లో ని తట్టిఅన్నారం హను మాన్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కాలనీ ,మహిళలు, చిన్నారులు పెద్దఎత్తున హాజరై బతుకమ్మ పాటలతో ఆడిపాడి అలరించా రు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెదగా ని రామకృష్ణ, ట్రెజరర్ భాను, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం

సమావేశంలో పాల్గొన్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ విఎల్.రాజు, ఆలిండియా ఎస్సీ,ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్

చిక్కడపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు, క్రిమిలేయర్‌కు వ్యతిరే కంగా పోరాటం చేస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ విఎల్.రాజు, ఆలిండియా ఎస్సీ,ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. గురువారం మాలమహానాడు కేంద్రకార్యాలయంలో పతాదికారుల సమావేశంలో పలు తీర్మా ణాలను ఆమోదించారు. ఉప ప్రణాళిక నిధులు, ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని, భూమి పంపిణీ, లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్ పటిష్ట నిర్మాణంతో పాటు, మాలభవన్ సాధన, ఎస్సీ,ఎస్టీ చట్టం అమలు చేయాలని, ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని తీర్మాణం చేసింది. దళితులపైన దాడులు ఆపాలని, హైడ్రా ఆధ్వర్యంలో దళితుల ఇళ్ళ కూల్చివేతలను ఆపాలని, దళితబందు అమలు రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి మాలమహానాడు జిల్లా కమిటీ కార్యకర్గం సభ్యులు అంతాపెద్దఎత్తున హాజరు అవుతారని వివరించారు. తెలంగాణలో మాలకులాన్ని కేవలం ఓటుబ్యాంక్ రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుంటుందని, సిఎం రేవం త్‌రెడ్డికి మద్దతుగా మాల ఎమ్మెల్యేలు, మంత్రులు పనిచేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ లో ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. మాలజాతి ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం, పొలిటికల్ పవర్ సాధన కోసం పోరాటం చేస్తామని విఎల్. రాజు ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జెఎన్.రావు, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు జె.భాస్కరరావు, వర్కింగ్‌ప్రెసిడెంట్ అర్వల రాజు పాల్గొన్నారు.

పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు ఘన సన్మానం

పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎంపీ.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 3,ప్రభాతవార్త: ఆదర్శనగర్‌లోని న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఎం.అరవింద్‌కుమార్ యాద ్వ్, మైనార్టీ గురుకులాల చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, పిసిసి సీనియర్ నేతలు గాలి అనిల్, భూ ా తిరెడ్డి, మహేష్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి జంటనగరాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

ప్రారంభమైన శరన్నవరాత్రులు

చిక్కడపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త: పండుగలు సనాతన ధర్మానికి ప్రతీకలు అని నగర తెలుగుదేశం ప్రార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వీధిలో నేతాజి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంటపం వద్ద అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మబంధు, కల్యాణందపీఠం పీఠాధ్యక్షులు బ్రహ్మశ్రీ ఆచార్య డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ వారి శిష్యబృందం నాగరాజుశర్మ, సాయినాథశర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కందూరి కృష్ణ, వందన రాజగోపాల్, వికాస్‌చంద్‌జైన్, వలభ్ జైన్, సజ్జన్‌జైన్, పి.హరీష్ గుప్త, ఉదయ్‌కుమార్ గుప్త, అనీల్‌కుమార్, శరత్‌గుప్త, డి.చంద్రమోహన్‌గౌడ్, పి.శివకృష్ణ గౌడ్, టి.నగేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంటపాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవి అలంకారంతో దర్శనమిస్తారు.

'వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంతో అమ్మవారు

చిక్కడపల్లి, అక్టోబరు 4 ప్రభాతవార్త: భక్తులు తిలకిస్తుండగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ నేతృత్వంలో జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు అలంకారంతో దర్శనమిచ్చారు. కాగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంతో దర్శనమిస్తారు. కాగా ఉదయం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

పారిశుద్ధ్య వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు చర్యలు

-కార్పొరేటర్ పావనీ వినయకుమార్

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా పారిశుద్ధ్య వ్యవస్థను మరింత ఆధునీకరించే కార్యక్రమాన్ని వేగవంతం చేయబోతున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. గురువారం డివిజన్‌లో జరుగుతున్న సానిటైజేషన్, పారిశుద్ధ్య పనులపై కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిహెచ్ ఎంసి పారిశుద్ధ్య విభాగం జవాన్‌లు, ఎస్ఎఫ్ఏలు, రాంకీ సిబ్బందితో కలిసి పలు చెత్తకుండీల పాయింట్‌లను, రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదరం ఉన్న ప్రాంతాలను పర్యటించి చెత్తతొలగించడానికి జరుగుతున్న జాప్యంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లో ఎక్కడ కూడా చెత్త ఉండకుండా చూడాలని సూచించారు. రాంకీ సిబ్బంది వాహనాలను ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడానికి అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్పొరేటర్ వెంట జిహెచ్ఎంసి జవాన్ విజయ్, ఎస్ఎఫ్ఏలు రాజ్‌కుమార్, సోమేశ్, శివ, ఆనంద్, రాంకీ ఇంచార్జ్ భానుప్రకాశ్, డివిజన్ సూపర్‌వైజర్ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు..

బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వారి తల్లులు

జీడిమెట్ల, అక్టోబర్ 3, ప్రభాతవార్త టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. టివిఆరన మోడల్ హై స్కూల్ అపురూపకాలనీ, సత్యవాణి విద్యానికేతన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లలో టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఎంగిలిపూల బతుకమ్మ పండుగ వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థినుల తల్లులు పాల్గొన్నారు. చిన్నరులు రంగురంగుల పట్టు వస్త్రాలు ధరించి బతుకమ్మ పండుగకి శోభను చేకూర్చి, కోలాటం వంటి ఆటపాటలతో అలరించారు.

పేట్ బషీరాబాద్‌లోని సుచిత్ర వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ గన్ పార్క్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

దుర్గామాత పూజలో తరిస్తున్న యువతరం

ఖానాపూర్‌లో దుర్గామాత తొలిరోజు పూజలో పాల్గొన్న భక్తుల దృశ్యం

నార్సింగి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : గండిపేట మండల పరిధిలోని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిల్లోని యువతరం "దుర్గామాత" పూజల్లో తరిస్తున్నారు. యువకులు పెద్ద ఎత్తున దుర్గామాత మాలలు ధరించి చెప్పులు వేసుకోకుండా నడుస్తూ, కటిక నేలపై పవళిస్తూ, నిరంతరం అమ్మవారి నామజపాన్ని స్మరిస్తూ, రెండుపూటల చన్నీటి స్నానాలు చేస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. దుర్గామాత నవరాత్రుల పాటు ఒంటిపూట భోజనం చేస్తూ తమలోని దుర్గాణాలను అణిచివేస్తూ, దేశం,ధర్మం,సమాజోద్ధరణకు ఉపయోగపడే సద్గుణాలను పెంపొందించాలని నిత్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దేవీనవరాత్రులు ముగిసేంత వరకు తమ తమ ఉద్యోగాలు నిర్వహిస్తూనే వ్రతాలను చేస్తున్నారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఈ సంవత్సరం దేవీనవరాత్రి వేడుకలలో భాగస్వాములు అవుతుండటం శుభపరిణామం. రాత్రి 9.గంటల నుంచి 12.గంటల వరకు అమ్మవారి మండపాల వద్ద చిన్నా,పెద్ద,ఆడ,మగ తేడా లేకుండా అందరూ అమ్మవారిని స్తుతిస్తూ భక్తిగీతాలాపన చేస్తున్నారు. దుర్గా నవరాత్రి వేడుకల ఆరంభంతో గండిపేట మండలమంతా ఆధ్మాత్మిక వాతావరణం కనిపిస్తుంది. పెద్దలు సైతం తమ బిడ్డలకు సనాతన ధర్మం గొప్పతనంను వివరిస్తూ మాలలు, వ్రతాలు వేయిస్తు, ప్రోత్సహిస్తున్నారు.

మొదటిరోజు పూజలందుకున్న అమ్మవారు

వెంగళరావు నగర్ జిటియస్ కాలనీ శ్రీ వీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయంలో దసరా ఉత్సవాలలో చండీ హోమంలో పాల్గొన్న ఆలయ కార్యానిర్వాహణ అధికారి గుమ్మడిదల సుధాకర్

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 03, ప్రభాతవార్త : శ్రీ భవాని దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. వాడవాడలా ఆలయాల అమ్మవారి మండపాలలో దుర్గామాతకు భక్తులు పూజలు నిర్వహించారు. వెంగళరావునగర్ కాలనీలోని జిటియస్ శ్రీ వీరాజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానంలో దేవదాయ ధర్మధాయ శాఖ ఆధ్వర్యంలో మొదటి రోజు అమ్మవారు శ్రీ భవాని దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అదేవిధంగా ఉదయం 8గంటల 30నిమిషాల నుంచి భక్తులచేత శ్రీ చక్రసహిత నవావరణ పూజ,చండీహోమం, నిర్వహించారు. అదేవిధంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి గుమ్మడిదల సుధాకర్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 03, ప్రభాతవార్త : దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా గురువారం బోరబండలోని స్వరాజ్ నగర్ హరిహర క్షేత్ర దేవస్థానంలో అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రతి రోజు ఒక్కొక్క అలంకరణలతో ఈనెల 12తేది వరకు అమ్మవారు దర్శనం ఇస్తారని 11వ తేదిన ఉదయం 10గంటలకు చండీహోమం, పూర్ణాహుతి ఉంటుందని ఆలయ నిర్వాహకులు కలవల సత్యనారాయణ తెలిపారు.

నేడు హైకోర్టు ఆవరణలో మల్టీ స్పెషాలిటీ హెల్త్ ,బ్లడ్ క్యాంప్

చార్మినార్,అక్టోబరు 3 ప్రభాతవార్త : రాష్ట్ర హైకోర్టు ఆవరణలోని న్యూ ఫైలింగ్ సెక్షన్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ నెల 4వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నల్సా (న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ హైదరాబాద్ ఉస్మానియా జనరల్ ఆసుపత్రి,నిర్మాణ్ ఆర్గనైజేషన్ (ఎన్‌జిఒ)సహకారంతో మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్,బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను నిర్వహించనున్నామని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ హైదరాబాద్ మెంబర్ సెక్రటరీ సిహెచ్ పంచాక్షరీ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ అలోక్ ఆరాధే మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్‌ను ప్రారంభంచనున్నారని ఆయన తెలియజేశారు. గౌరవ అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ సుజోయ్ పాల్ హాజరవుతున్నారని ఆయన తెలిపారు.ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ బార్‌కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహ్మారెడ్డి,తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.రవీందర్ రెడ్డి,ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్,నిర్మాణ్ సంస్థ సిఇఓ మయూర్ పట్నాలాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాషకు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యం

ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో పాల్గొన్న రామేశ్వర్‌గౌడ్ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అంగ్లంలో కూడా అనర్గళంగా మాట్లాడడమే తమ లక్ష్యమని విల్ టూ కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్, స్పోకెన్ ఇంగ్లీష్ కమ్యునికేషన్ స్కిల్ డెవలప్పర్ అర్రా రామేశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ సహకారంతో హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడినట్లుగానే ఆంగ్ల భాషకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. గత నలభై రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో ఆంగ్ల బోధన తరగతులు నిర్వహిస్తున్నామని, నేడు ఫిజికల్ తరగతులు నిర్వహించామన్నారు. కార్యక్రమానికి సుమారుగా ఐదువందల మంది ఉపాధ్యాయులు పాల్గొనడం గొప్ప పరిణామం అని, ఇప్పటివరకు తెలంగాణలో 33 జిల్లాల్లో 53వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ ఇంగ్లీష్ అనేది గ్లోబల్ లాంగ్వేజ్ అని తప్పు ఒప్పులను చూడకుండా నిరంతరం మాట్లాడితేనే ఆ బాషపట్ల పట్టు ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బేసిక్ నుంచి ఆంగ్లం నేర్చుకున్నవారికి తిరుగు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులు సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మాగంటిగోపినాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు.

అత్తాపూర్ గుమ్మకొండ కాలనీలో కుటంబ కార్డు కోసం సిబ్బంది చేస్తున్న పైలట్ సర్వేను డిసి రవి కుమార్ తనిఖీ చేస్తున్న దృశ్యం

పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : రాజేష్ కుమార్

బహదూర్‌పుర మండలం తహసీల్దార్ చంద్రశేఖర్‌ను కలిసిన నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు

చార్మినార్,అక్టోబరు 3 ప్రభాతవార్త : బహదూర్‌పుర మండలం తహసీల్దార్ చంద్రశేఖర్‌ను గురువారం బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్) ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు.మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా నియోజకవర్గంలోని మూసీ పరివాహక ప్రాంతాలలోని ఇండ్లు ఆర్‌బిఎక్స్ మార్క్ వేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా బహదూర్‌పుర మండలం తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బహదూర్‌పుర నియోజకవర్గంలో మూసీ పరివాహక ప్రాంతంలో 354 ఇళ్లు మార్క్ చేయటం జరిగిందని వారందరికి పాతబస్తీ జంగమ్మెట్‌లోని 180 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను,మిగతా వారికి కొల్లూరు లేదా జియాగూడలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని తెలిపారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లతో పాటు 25 వేల రూపాయల నగదు కూడ అందజేయనున్నామని ఆయన తెలియజేశారు..బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్) మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని,మూసీ పరివాక ప్రాంతం ప్రజలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు తరలి వెళ్లాలని ఆయన కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని ఎవరికి అన్యాయం జరగదని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఇక్బాల్, అబేద్ అలీ, బారి, జాకీర్ హుస్సేన్,సిద్దేశ్వర్‌లు పాల్గొన్నారు.

శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల్లో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు

నాంపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త : తొమ్మిదిరోజులపాటు నేత్రపర్వంగా జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మొదటిరోజు గురువారం పార్వతీ అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న మహాన్వితత శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12 శనివారం వరకు పార్వతీ అమ్మవారికి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు, ప్రతీరోజూ ఉదయం 5గంటల నుండి అమ్మవారి అభిషేకము; ఉదయం 9గంటలకు అమ్మవారి అలంకార దర్శనము; ఉదయం 10లకు అమ్మవారి హవనము, లఘు పూర్ణాహుతి, మహానివేదన; మధ్యాహ్నం 12గంటలకు మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ; రాత్రి 6.30గంటల నుండి శ్రీ లలితా సహస్రనామార్చన, నివేదన, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు.

అమ్మవారి దివ్యాలంకరణలో భాగంగా 3వ గురువారం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి; 4 శుక్రవారం శ్రీవైష్ణోదేవి; 5 శనివారం శ్రీగాయత్రిదేవి; 6 ఆదివారం శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణతోపాటు ఉదయం 9లకు లక్షపుష్పార్చన, మధ్యాహ్నం 12.30లకు అన్నదానం); 7 సోమవారం శ్రీలలితాదేవి; 8 మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి; 9 బుధవారం శ్రీసరస్వతీదేవి; 10 గురువారం శ్రీదుర్గాదేవి అలంకారంతోపాటు (ఉదయం 9 గంటలకు చండీహోమం); 11 శుక్రవారం శ్రీమహిషాసురమర్ధినిదేవి; 12 శనివారం శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంతోపాటు విజయదశమి పర్వదినం సందర్భంగా ఉదయం 9గంటలకు మహాపూర్ణాహుతి, రాత్రి 6గంటలకు శమీపూజ) పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు నిర్వహిస్తారని ఆలయ కమిటీ పేర్కొంది.

ఉప్పల్ మెట్రో స్టేషన్ హత్య కేసు చేధించిన పోలీసులు

ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎసిసి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, డిఐ రామలింగారెడ్డి తదితరులు

ఉప్పల్, అక్టోబరు 3 ప్రభాతవార్త : ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద కొద్ది రోజుల క్రితం అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన వ్యక్తి కేసును పోలీసులు చేధించారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, క్రైం సిఐ వై.రామలింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఇద్దరు యాచకుల మధ్య ఏర్పడిన గొడవ హత్యకు దారి తీసిందని ఎసిపి చక్రపాణి తెలిపారు.గత నెల 23వ తేదిన ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద సంగారెడ్డి జిల్లా నల్లంపల్లికి చెందిన బ్యాగరి లాలయ్య (40) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. అయితే అదే ప్రాంతంలో ఉంటున్న తిరుమలగిరి మండలం, కుమ్మరిగడ్డకు చెందిన బెల్లి రమేష్(37) అనే వ్యక్తితో గొడవ పడినట్లు తెలిపారు. గతంలో తాగిన మైకంలో వీరి మధ్య తగాదాలు ఉన్నాయని, గత శత్రుత్వం కారణంగా కర్రతో శరీరంపై తీవ్రగా గాయపర్చడంతో అతను తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మద్యానికి బానిసగా మారి వీరు పలుమార్లు గొడవ పడ్డారని తెలిపారు. మొదట అనుమానాస్పద కేసుగా నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగి గొడవే హత్యకు కారణమని తేల్చారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్ : ఉప్పల్‌లో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఒడిస్సాలోని బలాదియా గ్రామానికి చెందిన లోక్‌నాద్ ప్రధాన్ (19) నాచారంలోని ఒక కంపెనీలో పనిచేస్తూ ఉప్పల్ చిలుకానగర్ బొడ్రాయి వద్ద నివాసం ఉంటున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి పొడి తెచ్చి ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో చిలుకానగర్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా అతనిని పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రెండు కిలలో పొడి గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ చిరంజీవి, టి.మధు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయలు విక్రయిస్తూ బైక్ దొంగతనాలు : కూరగాయలు విక్రయించినట్లు నటిస్తూ రోడ్లపై తిరుగుతూ బైక్ దొంగతనాలకు పాల్పడుతన్న ఒక యువకుడిని ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన ముదావత్ శంకర్ (24) కూరగాయల విక్రయాలు చేస్తుంటాడని తెలిపారు. అయితే గత కొంత కాలంగా పార్కింగ్ చేసిన వాహనాలు చోరీ చేస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో తాగడుకు బాసిసగా మారి పలు ప్రాంతాల్లో వాహనాలు చోరీ చేసినట్లు తెలిపారు. రామంతాపూర్ భరత్‌నగర్‌లో మహేష్‌కుమార్‌గౌడ్ అనే వ్యక్తి వాహనం చోరీ చేసి పరారైనట్లు తెలిపారు. గతంలో చైతన్యపురి పిఎస్‌లో 8 కేసులలో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్లు అప్పగింత : ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 16 సెల్‌ఫోన్లను పోలీసులు బుధవారం బాధితులకు అప్పగించారు. ఉప్పల్ పిఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లతోపాటు, పడిపోయిన ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు ఎసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఎస్ఐ రామలింగారెడ్డి తెలిపారు. మొత్తం 16 ఫోన్లు అప్పగించామని, ఫోన్ పోయిన వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వీటి విలువ సుమారు రూ.3లక్షల 20 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఉపరపల్లిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

అత్తాపూర్ అక్టోబరు3,ప్రభాతవార్త : అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలని ఆ అమ్మవారిని మనస్ఫూర్తిగా పలువురు నాయకులు కోరుకున్నారు.గురువారం శ్రీ వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ఉప్పరపల్లిలోని రెడ్డి బస్తి కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసిన అమ్మవారిని పలువురు నాయకులు దర్శించుకొని ఉప్పరపల్లి గ్రామస్తులు ,కాలనీవాసులు యువకులతో కలిసి పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఏటా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అమ్మవారి విగ్రహాన్ని తెచ్చి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని అమ్మవారి అనుగ్రహం ఉంటే అంత శుభలే జరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బొక్క బాల్ రెడ్డి,సామా ఇంద్రపాల్ రెడ్డి,మోహన్ రెడ్డి,సత్తిరెడ్డి జీవరెడ్డి,నరసింహా రెడ్డి,మల్లారెడ్డి,రామ్ రెడ్డి, జైపాల్ రెడ్డి,సుమన్ రెడ్డి,సుధాకర్ రెడినడ,ప్రభాకర్ రెడ్డి ,వెంకట్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,నరసింహ రెడ్డి,శ్రీపాల్ రెడ్డి,ప్రశాంత్ సుధాకర్ గోపి మధు, ఉదయ్ కాంత్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,అజయ్ కాంత్ రెడ్డి,మణికాంత్ ,పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

అతాపూర్ అక్టోబరు3,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని గణేష్ నగర్ బంగారు మైసమ్మ దేవాలయంలో బాలత్రిపుఱ సుందరీ

హైడ్రా వల్ల జరిగిన చావులన్నీ ప్రభుత్వ హత్యలే

-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ముషీరాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త: హైడ్రా వల్ల జరిగిన చావులన్నీ ప్రభుత్వ హత్యలేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలతో అధికారంలోకి పదినెలలు గడుస్తున్నా హామీలను తుంగలో తొక్కి కేవలం హైడ్రా పేరుతో పేదలను నిర్దాక్షిణ్యంగా నిర్వాసితులను చేస్తోందని ధ్వజమెత్తారు. యథారాజా, తథా ప్రజా అన్న రీతిలో అప్రజాస్వామిక భాషను స్వయంగా ముఖ్యమంత్రే మాట్లాడుతున్నారు కాబట్టే ఇటీవల ఒక సినీ కుటుంబంపై తన సహచర మంత్రివర్గంలోని ఒక మంత్రి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని, ఇటువంటి అప్రజాస్వామిక భాష మాట్లాడిన మంత్రులు వెంటనే ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్లు దిగమింగే ఆలోచనలో ఉందని ఆరోపించారు. మూసీ సుందరీకరణ దేముడెరుగు ముందు చినుకు పడితే నగరంను మురుగు నీటితో ముంచెత్తుతున్న డ్రైనేజి వ్యవస్థను బాగు చేయాలని డిమాండ్ చేశారు. పేదల స్థితిగతులు పట్టించుకోకుండా కేవలం ఢిల్లీకి కప్పం కట్టడమే లక్ష్యంగా పెట్టుకుని పాలన సాగిస్తే ఎక్కువ రోజులు మనలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, జి.యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, అక్టోబర్ 3, ప్రభాతవార్త

నిజాంపేట్‌లో వెలసినటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం మొదటి రోజు బాలా త్రిపురసుందరిగా అమ్మవారిని అలంకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ నరసింహారెడ్డిలు ఆలయానికి విచ్చేసి బాలా త్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, రాజమోహన్‌రెడ్డి, మల్లేష్, నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్ఫూర్తిగా పూజిస్తే అమ్మ అనుగ్రహం లభిస్తుంది

-మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

అమ్మవారి పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, అక్టోబర్ 3, ప్రభాతవార్త

దేవి నవరాత్రుల పూజల్లో భాగంగా గురువారం అపురూపకాలనీలో బాలా త్రిపురసుందరి దేవిగా పూజలు అందుకొంటున్న అమ్మవారిని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే అమ్మవారి అనుగ్రహం, కోరిన కోరికలు నెరవేరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, కాలనీ అధ్యక్షులు తిప్పరెడ్డి, సెక్రటరీ రమణ, గణేషన, టెంపుల్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఆర్గనైసింగ్ సెక్రటరీ వీరబాబు, మల్లేష్‌గౌడ్, విజయ్, నారాయణరెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను హెచ్‌ఎంటి భూతి స్థలంలో ఏర్పాటుకు సహకరించండి

-సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట, అక్టోబర్ 2, ప్రభాతవార్త

జగద్గిరిగుట్టలో ఇతర జిల్లాలకు చెందిన సుమారు 50 బస్సులు ప్రతిరోజు రాత్రి నిలిపి ఉంటాయని, అలాగే నిత్యం వందలాది మంది ప్రయాణికులు ప్రయాణం కొనసాగిస్తుంటారని, వారి సౌకర్యార్థం జగద్గిరిగుట్టలో బస్ డిపోను ఏర్పాటు చేయాలని గురువారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ద్వారా రాష్ట్ర రోడ్డు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌ని రాష్ట్ర సచివాలయంలో కలలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లో నూతన బస్ డిపోలను ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఉందని, అందులో జగద్గిరిగుట్ట కూడా ఉండేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టీ.నర్సింహ, సమితి సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం : బిజెపి

సభ్యత్వ నమోదు జరుపుతున్న బీజేపీ నేతలు

కంటోన్మెంట్, అక్టోబర్ 3 ప్రభాతవార్తః కంటోన్మెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె.రామకృష్ణ తెలిపారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం వార్డు 2లోని అన్నానగర్, అర్జున్ నగర్‌లలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమాత్రం లేదన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని వివరించారు. రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే అందులో 118 మాత్రమే ఉన్నట్లు, కంటోన్మెంట్‌ను పూర్తిగా విస్మరించిందిన అన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధిలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రమే జరుపుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, స్వామి, హర్ష, రమేష్, మమత, వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమకు పట్టం కట్టే నవల 'నాగలాదేవి : నరసింహప్ప

చిక్కడపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త: శ్రీకృష్ణదేవరాయలు నిర్మల ప్రేమకు పట్టంగట్టిన నవల భగీరథ రాసిన చారిత్రక నవల 'నాగలాదేవి' అని విశ్రాంత ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అన్నారు. ఆర్టిసిక్రాస్ రోడ్స్‌లో కళాభారతి ప్రాంగణంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, రఘు అరికపూడి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ అనువాద దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రముఖ కవి కళారత్న బిక్కి.కృష్ణ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎం.నరసింహప్ప ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీనియర్ పాత్రికేయులు, కవి, నవలాకారులు భగీరథ రాసిన 'నవలాదేవి' నవలపై సమీక్ష జరిగింది. ఈ నవల ఈ శతాబ్దపు అత్యున్నత నవలగా వక్తలు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయలు, నాగలాదేవి ప్రేమ చరిత్రను గొప్ప చారిత్రక నవలగా భగీరథ శిల్పీకరించారన్నారు. 'నాగలాదేవి' నవల భాషా శైలి సౌందర్యం గురించి డాక్టర్ బీరం సుందరరావు, కథానిర్మాణం-చారిత్రకాంశాలపై డాక్టర్ నాళేశ్వరం శంకరం, పాత్ర చిత్రణపై డాక్టర్ జ్యోత్స్నప్రభ, నవలా సామాజిక సందేశంపై డాక్టర్ జల్లి విద్యాధరరావు అద్భుతంగా ప్రసంగించారు. ప్రముఖ అనువాధకురాలు పి.విజయలక్ష్మి పండిట్‌కు 'అనువాద శిరోమణి' బిరుదుతో పాటు భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ 'జాతతీయ జీవన సాఫల్య పురస్కారం'ను అందించి గౌరవించారు. అనువాదరంగంలో విశేషంగా కృషి చేసిన ప్రముఖ అనువాదకులు ఎలనాగ, రంగనాథ, రామచంద్రరావు, కొండపాక రవీంద్రచారి, పి.శ్రీనివాస్‌గౌడ్‌లకు 'జీవన సాఫల్య పురస్కారాలు' అందించారు. ఈ సందర్భంగా పారిజాతం పత్రికా పురస్కారాలను మారేపల్లి భువనేశ్వరి, లలితా వర్మ, శ్రీసుధా కొలచన, ఉషారాణి, వి.రాజేశ్వరిలు అందుకున్నారు. పెద్దూరి వెంకటదాసు, రాధాకుసుమ, పద్మశ్రీలతల నిర్వహణలో కవిసమ్మేళనం జరిగింది. అరికపూడి సేవాట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ అరికపూడి రఘు, ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బిక్కి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ రాసిన 'నవలాదేవి' నవలను ఆవిష్కరించిన దృశ్యం

ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేలా అమ్మవారి ఆశీస్సులు

శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని.

బేగంపేట అక్టోబరు 3,ప్రభాతవార్త

ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేలా అమ్మ వారి ఆశీస్సులు ఉంచాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన గురువారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరందేవీ నవరాత్రులలో భాగంగా తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలోని అమ్మ వారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ పండితులు ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ కు ప్రసాదాలను అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పోరేటర్లు, అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్, అత్తెల్లి అరుణా గౌడ్, కొసికే కిరణ్మయి, ఆలయ ట్రస్టీ సురిటి కామేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్, నాగులు, మహేందర్, ఆనంద్‌పాటిల్, చంద్రప్రకాష్, అరుణ్‌భట్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానంద తీర్థ జయంతి

-స్వామి రామానంద అంటే పీవీకి అపారమైన భక్తిభావం

- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

స్వామి రామానంద తీర్థ జయంతి సందర్భంగా చిన్నారులతో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి.పీ.వీ ప్రభాకర్‌రావులు.

బేగంపేట అక్టోబరు 3,ప్రభాతవార్త

స్వామి రామానంద తీర్థ అంటే దివంగత భారత ప్రధాని తమ తండ్రి గారైన పీ.వీ.నర్సింహారావుకు అపారమైన భక్తి భావం అని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. రామానంద తీర్థ జయంతి సందర్భంగా బేగంపేట బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 9లో గురువారం స్వామి రామానందతీర్థ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కీర్తనలు, భజనలు చేసారు. అనంతరం వాణీదేవి చిన్నారులతో కల్సి వెళ్లి స్వామీజీ సమాధి వద్ద పుష్పాంజలి సమర్పించారు. ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అసెంబ్లీ ఎదురుగా ఉన్న స్వామీ రామానంద తీర్థ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా వాణీదేవి తన తండ్రి దివంగత భారత ప్రధాని పీ.వీ.నర్సింహారావు స్వామి రామానంద తీర్థకు ఎంతో ఇష్టమైన వ్యక్తి అని అన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ సేవలను గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో పీ.వీ.గ్లోబెల్ ఫౌండేషన్ ఛైర్మన్ పీ.వీ.ప్రభాకర రావు, సురభి సోలార్ ఛైర్మన్ శేఖర్ మారంరాజు, స్వామి రామానంద తీర్థ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ వాసుకి , ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

పేద కుటుంబం చికిత్సకు ఎంపి అరవింద్ కుమార్ యాదవ్ తోడ్పాటు

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం సైదులు కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ లేటర్ అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ నేత అరవిందర్‌కుమార్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబరు 3 ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.ఆరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. పార్లమెంటు సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్ ద్వారా నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం నల్గొండ జిల్లా కొతగడ్డ, బొతలపాలంకు చెందిన సైదులుకు మంజూరైన 2.50లక్షల సిఎంఆర్ఎఫ్ ఎల్ఒసి లేటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవర్గాలకు ఖరీదైన వైద్యం అందించడానికి సిఎంఆర్ఎఫ్ ద్వారా నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అందిస్తున్న సహాయ సహకారాలతో ఇప్పటికే పలువురు అర్హులకు సిఎంఆర్ఎఫ్ కింద చెక్కులు, ఎల్ఒసి లేటర్లు అందించడం జరిగిందన్నారు. అనిల్‌కుమార్‌యాదవ్ పేదవర్గాలకు సహాయపడేందుకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సహకరిస్తున్నందుకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు.

దుర్గమ్మవారిని కొలిచిన వారికి అంతా శుభమే

- మణికొండ మున్సిపల్ ఛైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్

మణికొండలో దుర్గమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఛైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్

నార్సింగి, అక్టోర్ 3 ప్రభాతవార్త :

శక్తి స్వరూపిణి అయిన దుర్గమ్మవారిని కొలిచిన వారికి అంతా శుభమే కలుగుతుందని మణికొండ మున్సిపల్ ఛైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలో ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారికి ఛైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టి మనుగడకు శక్తినిచ్చే జగన్మాత దుర్గమ్మ అని వివరించారు. శక్తి స్వరూపిణిని కొలిస్తే మనలో శక్తి పెరుగుతుందని, ఏ కార్యం చేపట్టినా సఫలం అయ్యితీరుతుందన్నారు. యుగ యుగాల నుంచి సనాతన ధర్మంలో దుర్గామాతను కొలువడం జరుగుతుందని, ముఖ్యంగా దుర్గానవరాత్రి వేడకల్లో అమ్మవారిని కొలిస్తే త్వరగా అనుగ్రహిస్తుందని వివరించారు. మనదైన ధర్మంను భావి తరాలకు తెలిపేందుకే సనాతన ధర్మంలో పండగలు, సంస్కృతి, సాంప్రదాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటి వెనకాల ఉన్న ఆంతర్యంను గుర్తెరిగి నడుచుకుంటే మనకు అంతా శుభమే కలుగుతుందని ఛైర్మన్ కస్తూరి నరేందర్ తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో కౌన్సిలర్లు పురుషోత్తం, లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యులు అహ్మద్‌షాఖాన్, నాయకులు కస్తూరి యాదయ్య, మల్లేష్, కిరణ్, దేవదాస్, సత్యనారాయణ, లక్ష్మణ్, ప్రభాకర్, దేవేందర్, అఖిల్, శ్రవణ్, పవన్, సాయికుమార్ పాల్గొన్నారు.

సుమధురం సంగీత నాట్య వాయిద్య కళాకారుల సమ్మేళనం

-సౌత్ ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు

-వైభవంగా అంతర్జాతీయ సంగీత దినోత్సవం

రవీంద్రభారతి, అక్టోబరు 3 ప్రభాతవార్త : వంద ప్రపంచ రికార్డులను సాధించిన ఆర్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డా. రంజిత్ నేతృత్వంలో మహాత్మాగాంధీ 155వ జయంతి వేడుకలు, అంతర్జాతీయ సంగీత దినోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రదర్శింపబడి సౌత్ ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు పొందారు. లయన్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మా ఆర్టిస్ట్ ఘర్షణ శ్రీనివాస్ పాల్గొని ఆత్మీయ అతిథులు బిక్కునాథ్ నాయక్, మూస అలీఖాన్, జె.ఎస్.రాజేంద్ర, డా. కట్కమ్ భాస్కర్‌గుప్తా, గురువులు ఘంటసాల పవన్ కుమార్, కూచిపూడి కిరణ్‌కుమార్, చంద్రిక రాజేష్, పూజా, రాజ్‌శ్వరూప్, శ్యాంకళ్యాణ్, నవీన్‌కృష్ణ, రాజీవ్ శ్రీనివాసాచార్యులు, సుందరి, శాలిని, చందు ఆంజనేయులు తదితరులతో కలిసి ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి, గురువులను ఘనంగా సన్మానించి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన నాట్యకళాకారులను, నాట్యగురువులను ప్రోత్సహిస్తున్న సంస్థను, రంజిత్‌ను ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా 156 మంది కళాకారులు సంగీత, నృత్య, వాద్య ప్రదర్శనలతో వేదికను హోరెత్తించి ఆహుతులను సంగీతలోకంలో విహరింపజేశారు.

చిన్నారి కళాకారులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, రంజిత్ తదితర అతిథులు

అంజయ్యనగర్‌లో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

గచ్చిబౌలి, అక్టోబరు 3 ప్రభాతవార్త

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో విద్యార్థులు ఆడి, పాడారు. అంజయ్యనగర్‌లోని విద్యా టాలెంట్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాలలో చదువుతున్న బాలికలు, ఉపాధ్యాయులు సాంప్రదాయ వస్త్రధారణతో ఉత్సవాలకు హాజరయ్యారు. విద్యార్థులు పేర్చి తీసుకువచ్చిన బతుకమ్మలను స్కూల్ ఆవరణలో ఉంచి తెలంగాణ సంస్కృతి ప్రతిభింబించే విధంగా ఆట, పాటలతో సందడి చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన విద్యా టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్, విద్యారత్న అవార్డు గ్రహిత డాక్టర్ పొన్నాడ త్రిమూర్తులు విద్యార్థులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకునే బతుక మ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ ప్రతీక అని అన్నారు. ప్రకృతిలో లభించే తీరొక్క పూలను సేకరించి బతుకమ్మను పేర్చి, పార్వతీదేవికి ప్రతీరూపమైన గౌరమ్మ ను ప్రతిష్టించి కొలిచే బతుకమ్మ ఉత్సవాలను తెలంగాణలో ఆడబిడ్డలు, మహిళలు ఉత్సాహంగా, సాంప్రదాయబద్దంగా నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల బతుకమ్మ ఆట, పాటలతో పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులతో పొన్నాడ త్రిమూర్తులు

అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు

బాల భక్త సమాజ్ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న దృశ్యం

బేగంబజార్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: దేవిశరన్న నవరాత్రి ఉత్సవాలనుపురస్కరించుకుని బాల భక్తవీర్ సమాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ మైనార్టీ లింగ్విస్టిక్ సెల్ యూత్ ఛైర్మన్ అశోక్‌సింగ్ మురళీమోహన్‌సింగ్ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు ప్రసాదాలను అందచేశారు.

ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు

చిక్కడపల్లి, అక్టోబరు 03 ప్రభాతవార్త:

బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ విద్యార్థినులు, అధ్యాపకులు ఆటపాటలతో సందడి చేశారు. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మన సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. విద్యార్థినీలు తెలంగాణ సంప్రదాయ దుస్తుల్లో తెలుగుదనం ఉట్టిపడేలా ముస్తాబై రంగురంగుల బతుకమ్మలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కోఆర్డినేటర్ సుంకరి నవీన్ అధ్యాపకులను సమన్వయం చేస్తూ బతుకమ్మ పాటలకు అనుగుణంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు. విద్యార్థినులు పెద్దసంఖ్యలో చేరుకుని బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కళాశాల డైరెక్టర్ అధ్యాకులు విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దసరా నవరాత్రి ఉత్సవాలు

నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా అన్నదానంలో పాల్గొన్న దిడ్డి రాంబాబు

హైదరాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త: జైభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం బర్కత్‌పురా లోని చమాన్ వద్ద ప్రారంభమయిన ఈ ఉత్సవాలకు జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలో అమ్మవార్లను దర్శించుకోవాలి : జంపన ప్రతాప్

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జంపన ప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 3 ప్రభాతవార్తః దసర శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా న్యూబోయిన్‌పల్లి బాపూజినగర్ శ్రీదేవి, నల్లపోచమ్మ ఆలయంలో గురువారం మొదటిరోజు బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రులు చిత్తశుద్ధితో, భక్తిశ్రద్ధలతో వివిధ విశేషాలంకరణలో ఉన్న అమ్మవార్లను కొలిస్తే కోరిన కోరికలు నెరవేరుతాని తెలిపారు. ప్రతిరోజు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, అజిత్, జహంగీర్, మారుతి గౌడ్, నరసింహ, నరేందర్, శ్రీకాంత్, దశరత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
కాప్రా సర్కిల్-1
GHMC

నిట్ నం.& తేదీ: GHMC/KC/E/1/16/2024-25 తేదీ: 03.10.2024
పని పేరు : నిర్వహణ పనులు-6. అంచనా మొత్తం (రూ.లక్షల్లో) : 7.35. 6 పనులు. ప్రారంభ తేది మరియు సమయం : 04.10.2024 మ.3.00గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం : 07.10.2024 మ.3.00గం. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నెం.: శ్రీ ఎల్.నరేందర్, E.E.కాప్రా సర్కిల్-1, GHMC, సెల్ : 9989930401. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-1, GHMC.
DIPR.No.4923-PP/CL/Advt/1/2024-25 తేదీ: 03.10.2024

ఆర్‌పిఐ క్రిస్టియన్ సెల్ జాతీయ అధ్యక్షుడిగా జాన్ మాస్క్

జాన్‌మాస్క్‌కు నియామకపత్రం అందిస్తున్న రాందాస్ అథవాలే

హైదరాబాద్, అక్టోబరు 3,ప్రభాతవార్త:

రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియా క్రిస్టియన్ సెల్ జాతీయ అధ్యక్షుడిగా నగరానికి చెందిన జాన్‌మాస్క్‌నుని నియమిస్తూ ఆపార్టీ అధ్యక్షులు, కేంద్ర మంత్రి రాందాస్ అతువాలె గురువారం నియమకపత్రం అందజేశారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉన్న దళిత క్రైస్తవుల హక్కులతోపాటు వారికి చేరాల్సిన పథకాలపై కృషి చేస్తారని తెలిపారు. ఈసందర్భంగా జాన్‌మాస్క్ మాట్లాడుతూ దళిత క్రైస్తవుల పక్షాన సమస్యలపై ,హక్కులకై పోరాడేందుకు ఆర్‌పిఐపార్టీ తరపున తను జాతీయ అధ్యక్షుడిగా నియమించినంద

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా జయశ్రీ

కౌన్సిలర్లతో కలిసి ఎన్నిక పత్రాన్ని చూపుతున్న చైర్‌పర్సన్ జయశ్రీ

హయత్‌నగర్, అక్టోబరు 3 ప్రభాతవార్త: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై గతనెల 13న ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గగా... ఆమె పదవిని కోల్పోయారు. ఈక్రమంలో నూతన చైర్‌పర్సన్ ఎన్నికకోసం ఎన్నికల కమిషన్ ఈనెల 3న సమావేశం నిర్వహించడానికి నోటీఫికేషన్ జారీచేసిన విషయం విదితమే. ఈక్రమంలో చేవెళ్ల ఆర్డీవో పి.సాయిరాం అధికృత అధికారిగా తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో గురువారం 11 గంటలకు సమావేశం నిర్వహించారు. సమావేశానికి 21 మంది సభ్యులు హాజరయ్యారు. నూతన చైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీని కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ ప్రతిపాదించగా... పాశం అర్చన బలపరిచారు. ఇతర సభ్యులెవరూ పోటీలో ఏకపోవడంతో జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు అధికారి ప్రకటించారు. సమావేశానికి మాజీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న, అనురాధ, సామ అనూషలు గైర్హాజయ్యారు. ఈ సంద ర్భంగా నూతన చైర్‌పర్సన్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపాలిటీ కౌన్సిలర్ల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

హరిహర క్షేత్రంలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారిని పూలతో సుందరంగా అలంకరించిన దృశ్యం

మలక్‌పేట అక్టోబరు3, ప్రభాతవార్త : మలక్‌పేట్ పల్టన్‌లోని శ్రీ హరిహర క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని దేవాలయం చైర్మన్ సుగురు రమేష్ పేర్కొన్నారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....దేవి నవరాత్రులను పురస్కరించుకొని ప్రతిరోజు పంచామృత అభిషేకం కుంకుమార్చన, సాయంత్రం సామూహిక సహస్ర నామ కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు ఒక్కొక్క అలంకారంతో అమ్మవారికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ జె.మార్తాండ రావు, ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాస చార్యులు, కాసుల చంద్రశేఖర్ శర్మ, సభ్యులు సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రేణు అగర్వాల్, పారిజాత రెడ్డి, శెట్టి విజయ కుమార్, రొడ్డ రమేష్, తదితరులు పాల్గొన్నారు

ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి

-కార్పొరేట్ బొక్క భాగ్యలక్ష్మి

ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రమేష్ రెడ్డి ,కృష్ణా రెడ్డి,తదితరులు

మలక్‌పేట అక్టోబరు3, ప్రభాతవార్త : ఉత్సవాలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ముసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని లక్ష్మినగర్‌లో బుధవారం రాత్రి జరిగిన బతుకమ్మ ఉత్సవాలకు ఆమె అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...అతిపెద్ద పూల పండుగ బతుకమ్మ పండుగ అన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

శ్రీ షిరిడి సాయి సంస్థాన్‌లో....

సలీం నగర్‌లో శ్రీ షీరిడి సాయిబాబా సంస్థాన్‌లో దేవాలయం కమిటీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణా రెడ్డిల ఆధ్వర్యంలో అమ్మవారి దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అమ్మవారి నవరాత్రులను పురస్కరించుకొని ప్రతి రోజు దేవాలయంలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, పాల్గొన్నారు.

మహిళా మంత్రులకు కెటిఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి : శ్రీనివాస్

కెటిఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

మలక్‌పేట అక్టోబరు3, ప్రభాతవార్త : మహిళా మంత్రులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మలక్ పేట్ నుంచి నాయకులు కార్యకర్తలతో కలిసి తరలివెళ్లి నగరంలోని బషీర్‌బాగ్ వద్ద కెటిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీఆర్ఎస్ సోషల్ మీడియాలో కెటిఆర్ మహిళా మంత్రులపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. కెటిఆర్‌పై గతంలో పలు ఆరోపణలు వచ్చాయని , రక్త నమునాలను ఇవ్వడానికి కెటిఆరన ముందుకు రావాలన్నారు. కెటిఆర్ వెంటనే మంత్రులు సీతక్క, కొండ సురేఖలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షకీల్, షాహిద్ ఖాన్, రాహుల్ సింగ్, పింకి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో శ్రీ సరస్వతి దేవి

పూజలు నిర్వహిస్తున్న మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

సైదాబాద్. అక్టోబరు 3 ప్రభాతవార్త: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీ సరస్వతి దేవి అమ్మవారు గురువారం శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు చండీ హోమం నిర్వహించనున్నారు. దేవాలయ పాలక మండలి మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, దేవాలయ కార్యనిర్వాణాధికారి వి.ప్రేం కుమార్ లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గౌడ స్మశానవాటికలో బోర్‌వెల్ పనులు : బన్నాల గీత

శ్రీనగర్ కాలనీ గౌడ స్మశాన వాటికలో బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, అక్టోబరు 3 ప్రభాతవార్త : చిలుకానగర్ డివిజన్‌లోని వైకుంఠదామాలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో స్మశానవాటిక అభివృద్ధిలో భాగగా బోర్‌వెల్ నిర్మాణంతోపాటు, ప్రహరిగోడ, స్నానాల గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్‌లోని అన్ని కులాల స్మశానవాటికలలో సదుపాయలు కల్పనకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారం అందిస్తున్నారని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొక్కొండ జగన్, గౌడ సంఘం సభ్యులు బజారు జగన్‌గౌడ్, మురళీగౌడ్, నవీన్‌గౌడ్, పండ్ల కిషన్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహకాళి ఆలయంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

శ్రీ మహకాళి ఆలయంలో శ్రీ దుర్గాహోమం నిర్వహిస్తున్న సుర్వీ భీష్మగౌడ్, జయమ్మ దంపతులు

ఉప్పల్, అక్టోబరు 3 ప్రభాతవార్త : దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామంతాపూర్‌లోని శ్రీ మహకాళి ఆలయంలో దసరా నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో శతఘటాభిషేకము, రజత కవచధారణ, కలశ స్థాపన, చతుషష్యుపచార పూజ, శ్రీ దుర్గాహోమం నిర్వహించారు. ఆలయ కమిటి నేతలు సుర్వీ భీష్మగౌడ్, జయమ్మ దంపతులు, ధీకొండ శ్రీనివాస్, సుగుణ, తడిసిన సురేందర్‌రెడ్డి దంపతులు పూజలలో పాల్గొన్నారు. అదే విధంగా ఈనెల 4వ తేదిన శ్రీ బాలత్రిపుర సుందరిగా, ఈనెల 5వ తేదిన అన్నపూర్ణదేవిగా, ఈనెల 5వ తేదిన శ్రీ గాయత్రిదేవిగా, 7వ తేది శ్రీ లలితా త్రిపుర సందరీదేవిగా, 8వ తేదిన శ్రీ మహాలక్ష్మిదేవిగా, 9న శ్రీ మహాసరస్వతిదేవిగా, 10న శ్రీ మహాదుర్గాదేవిగా, 11వ తేది శ్రీ మహిశాసుర మర్ధినిగా, 12న శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి పూజలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు సుర్వి భీష్మగౌడ్, దీకొండ శ్రీనివాస్, రేవు కృష్ణయ్య, సర్వ బాబుయాదవ్, సర్వ సత్తయ్య యాదవ్, టి.సురేందర్‌రెడ్డి, సముద్రాల నాగేందర్, డి.బాలరాజు, పి.దాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

ఉప్పల్, అక్టోబరు 3 ప్రభాతవార్త : రామంతాపూర్‌లోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయం దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో ఈనెల 3వ తేది నుంచి 12 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, పన్నాల అర్జున్‌లు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరణ చేస్తామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని శ్రీ బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఈనెల 4న శ్రీ గాయత్రిదేవిగా ఈనెల 5న శ్రీ అన్నపూర్ణదేవిగా, 6వ తేదిన శ్రీ లలితా త్రిపుర సందరీదేవిగా, ఈనెల 7న శ్రీ మహాచండీదేవిగా, ఈనెల 8న శ్రీ మహాలక్ష్మిదేవిగా, 9న శ్రీ సరస్వతిదేవిగా, 10న శ్రీ దుర్గాదేవిగా, 11న శ్రీ మహిషాసురమర్ధినిగా, 12న శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అలంకరిస్తామని తెలిపారు. అనంతరం శమీ పూజ ఉంటుందని, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

నహోమం నిర్వహిస్తున్న సునీల్ రెడ్డి దంపతులు

సైదాబాద్. అక్టోబరు 3 ప్రభాతవార్త: సైదాబాద్‌లోని శ్రీ విజయ దుర్గ దేవాలయంలో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారంన మొదటి రోజు శ్రీ స్వర్ణకవచ దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సునీల్‌రెడ్డి దంపతులు గురువారం హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 11వ తేదిన ఉదయం విశేష చండీ హోమం నిర్వహించనున్నారు. 12వ తేది శనివారం పల్లకిపై అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

చంపాపేటలో అమావాస్య సందర్భంగా అన్నదానం

సైదాబాద్. అక్టోబరు 3 ప్రభాతవార్త: శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదర్ లవ్ ఆర్గనైజేషన్ ఫర్ అవేర్నెస్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవాన్ మాట్లాడుతూ గత 17 నెలలుగా ప్రతి అమావాస్య నాడు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్వేత, బిఆర్ఎస్ ఎల్‌బినగర్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందని ద్రాక్షగా కార్పొరేట్ వైద్యం

-రక్షక భటులకు రక్షణగా లేని ఆరోగ్య భద్రత కార్డు : ఎఐవైఎఫ్

తుర్కయంజాల్ అక్టోబరు3, ప్రభాతవార్త : రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు దక్కడం లేదని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శివ కుమార్ గౌడ్ అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సంపూర్ణమైన ఆరోగ్యం అందించాలని ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు కానీ నేడు ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ పేరు వింటేనే అడ్మిట్ చేసుకోకుండా మరియు ప్రథమ చికిత్స కూడా చేయని పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొంది. మారుమూల గ్రామాలలోని ప్రజలు అత్యవసర పరిస్థితులలో వచ్చినా కూడా మా దగ్గర బెడ్స్‌లు లేవు ఐసియూలో ఖాళీగా లేదు అని సమాధానం చెప్తున్నారు. ఈ నగరం వచ్చి దిక్కుతోచని పరిస్థితులలో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్న మధ్య తరగతి ప్రజలకు ఇదోక భారంగా తయారయింది. అంతేకాదు ఈ రాజ్యం కోసం భద్రతగా నిలబే పోలీస్ అధికారులకు కూడా ఆరోగ్య భద్రత కరువైంది. ప్రభుత్వం వారికి వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చే ఆరోగ్య భద్రత కార్డు ప్రస్తుతం ఏ హాస్పిటల్లో కూడా చెల్లడం లేదు. తూతూ మంత్రంగా తీసుకుంటన్న ప్రైవేట్ హాస్పిటల్స్ కొన్ని మాత్రమే ఉన్నాయి నిరంతరం ఉద్యోగాలు చేస్తూ ఇటు ప్రజలకు అటు పాలకులకు భద్రత కల్పించే పోలీసులకే భద్రత కరువైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వాలని అఖిల భారత యువజన సమైక్య తరపున డిమాండ్ చేశారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో బతుకమ్మ సంబరాలు

ఉప్పల్, అక్టోబరు 3 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు రెండోరోజు ఘనంగా నిర్వహించారు. శ్రీ మానస కూచిపూడి డాన్స్ స్కూల్ ప్రణవి తుమ్మాటి శిష్య బృందం ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. అంబ పరాకు, మూషిక వాహన, ముద్దుగారే యశోధ, వినాయక కౌతం, గణేశా పంచరత్న, మరకతమణియ, మీనాక్షి పంచరత్న, గరుడ గమన, శివ స్త్రోత్రం, అలోకయేహ్, బిందు మాలిని, తిల్లాన అంశాలను కళాకారులు ప్రదర్శించారు. కళాకారులు శ్రీ విద్య, శాన్వి, పవిత్ర, స్నేహ, దీప్తి, హిమజ, హర్షిత, రోహన్, శ్రీమయి తదితరులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సందర్శకులను ఆకట్టుకున్నారు.

బతుకమ్మ ఆడుతున్న శివసాయినగర్ కాలనీ మహిళలు

టిఎస్ఆర్ కాలనీ బతుకమ్మ ఉత్సవాలకు హాజరైన కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి

శ్రీనివాస్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

ఘనంగా బతుకమ్మ సంబురాలు

బడంగ్‌పేట్‌లో అయ్యప్ప సన్నిధానం నిర్మాణపు పనులకు శ్రీకారం

సన్నిధానం పనులకు భూమి పూజ చేస్తున్న మేయర్ పారిజాత

సరూర్‌నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లోనున్న కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వాముల సన్నిధానం పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిఆ హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లు స్థానిక బడంగ్‌పేట్ కార్పొరేటర్లతో కలిసి సన్నిధానం నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు లిక్కి కృష్ణారెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి భుజంగరెడ్డి, గట్టు మహిపాల్ పాల్గొన్నారు.

19వ డివిజన్‌లో బిటి రోడ్డు పనులు ప్రారంభం

అంతకు ముందు కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ సాయినగర్ కాలనీలో బిటి రోడ్డు నిర్మాణపు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ పారిజాత స్థానిక కార్పొరేటర్ రామోజీ అమిత శ్రీశైలంచారితో కలిసి రోడ్డు పనులను ప్రారంభించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బాలాపూర్ గణేష్ లడ్డూ అందజేత

కిషన్‌రెడ్డికి లడ్డూను అందజేస్తున్న శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: ప్రసిద్ధ బాలాపూర్ గణేష్ లడ్డూ ప్రసాదాన్ని వేలం విజేత అయిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి గురువారం కేంద్ర మైనింగ్, బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి అందజేశారు. రాష్ట్ర బిజెపి కార్యాలయంలో కేంద్ర మంత్రిని కలిసిన శంకర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి బాలాపూర్ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సూర్యప్రకాశ్, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డికి కెఎల్ఆర్ పరామర్శ

మర్రి వెంకటమ్మకు నివాళులర్పిస్తున్న కెఎల్ఆర్

సరూర్‌నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: మాతృ వియోగంలో ఉన్న నాదర్‌గుల్ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మర్రి హన్మంత్‌రెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. నాదర్‌గుల్‌లోని తోట యెట్టారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన హన్మంత్‌రెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన కెఎల్ఆర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన హన్మంత్‌రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మర్రి ప్రభాకర్‌రెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, పుట్టగళ్ళ జగన్, బంగా రు అశోక్, మర్రి లింగారెడ్డిలతో పాటు శేఖర్,, వెంకటేశ్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, సా మ వరుణ్‌రెడ్డి, సుభాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

-భాస్కర్‌రెడ్డి సన్మానిస్తున్న భూపాల్‌రెడ్డి, రమేష్‌నేత,

ఎల్.బి.నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: గ్రీన్‌హిల్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో పగిళ్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కనకదుర్గమ్మ అమ్మవారిని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సబ్యుడు దేప భాస్కర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని కాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు బండి మధుసూదన్‌రావు, తలాటి రమేష్‌నేత, లింగస్వామిగౌడ్, విప్లవ రెడ్డి, పుష్పలత, శైలజరెడ్డి, ఊర్మిల, పగిళ్ల రమాదేవి, సుహాసిని పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ శ్రీకనకదుర్గ దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్‌రెడ్డికి అందజేస్తున్న దేవాలయం కమిటీ సభ్యులు

సర్దార్ పటేల్ నగర్‌లో పాత దేవుళ్ళ ఫొటోలను సేకరించిన కార్పొరేటర్ శ్రావణ్

శానిటైజేషన్ అధికారులతో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్..

నేరేడ్‌మెట్, అక్టోబర్03, ప్రభాతవార్త: 140 డివిజన్‌ను పూర్తి స్థాయిలో శుభ్ర పరిచేందుకు సంబధిత అధికారులతో కలసి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రావణ్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో నివసించే వారి ఇళ్లలో ఉన్న పాత దేవుళ్ళ ఫొటోలను మున్సిపల్ శానిటేషన్ అధికారులతో కలసి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళలోనే పాత దేవుళ్ళ ఫొటోలను చెరువు పైన, చెత్త దగ్గర, రోడ్లపైన, ఆలయాల వద్ద వదిలిపెట్టడం సరైంది కాదన్నారు. అలా చేస్తే దేవుళ్ళను అగౌరవ పరిచినట్టేనని తెలిపారు. అంతేకాకుండా శానిటైజేషన్ సమస్యకు దారి తీస్తుందన్నారు. వాటిని సేకరించి తాము రిసైక్లింగ్ చేస్తామన్నారు. అదేవిధంగా ఇళ్ళలో ఉంచే చెత్తను రోడ్డుపై వేయకుండా ఆటోలోనే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటైజేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, గిరి, బాలమణి, రవి, రాజు, నందు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

పనులను శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: డాక్టర్స్ కాలనీలో రోడ్డునెంబర్ 4లో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణం పనులకు కాలనీ ప్రధానకార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావుతో కొబ్బరికాయ కొట్టించి పనులకు శంకుస్థాపన చేశారు. సెవరేజ్ బోర్డు డ్రైనేజీలైన్ పనిని స్థానిక కాలనీ వాసులు అందరూ కలిసి ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆచార్యులు, ఉమాపతీ, సత్యనారాయణ, అధికారులు ప్రవీణ్, సూపర్‌వైజర్ శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పనులు వేగవంతం చేయాలి:పవన్

ఎల్.బి.నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త: కాలనీలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులు వేగవంతం చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ న్యూమారుతినగర్, గౌడ్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చుడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, మహేష్, వెంకట్‌రెడ